క్లుప్తంగా

కేబుల్ చోరీ



బోరుబావి వైరు ఎత్తుకెళ్లారని చూపుతున్న సర్పంచ్ లక్ష్మీనారాయణ

గుడిబండ: మండల పరిధిలోని రాళ్లపల్లి గ్రామంలో వాటర్ వర్క్స్ బోరుబావికి అమర్చిన దాదాపు 80 మీటర్ల కేబుల్‌ను సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లినట్లు సర్పంచ్ లక్ష్మీనారాయణ తెలిపారు. తాగునీటి వాటర్ వర్క్స్ బోరుబావికి అమర్చిన కేబుల్ చోరీ జరగడంతో నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడ్డారు. తరచూ వైర్‌ను దుండగులు చోరీ చేస్తున్నారని సర్పంచ్ తెలిపారు. దీనిపై గుడిబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేస్తామన్నారు.

నేడు మడకశిరలో 'మేరా రేషం-మేరా అభిమాన్'

మడకశిర: పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో గురువారం ఉదయం 9 గంటలకు మేరా రేషం-మేరా అభిమాన్ (నా పట్టు-నా అభిమానం) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ సిల్క్‌బోర్డు అధికారులు తెలిపారు. పట్టు పరిశ్రమ అభివృద్ధిలో మరింత సాంకేతిక పరిజ్ఞాన్ని పెంచడానికి వీలుగా పట్టు రైతులకు ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని చెబుతున్నారు. సెంట్రల్ సిల్క్‌బోర్డు, రాష్ట్ర పట్టు పరిశ్రమశాఖ సంయుక్తంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా మంత్రులు సవిత, సత్యకుమార్‌యాదవ్, పట్టు పరిశ్రమశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, సెంట్రల్ సిల్క్ బోర్డు జాయింట్ సెక్రటరీ నరేష్‌బాబు, కలెక్టర్ చేతన్, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. జిల్లాలోని పట్టు రైతులు ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

లేపాక్షి: స్థానిక వెలుగు కార్యాలయంలో ఈనెల 12న ఉదయం 11 గంటలకు ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీతో పాటు మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల, డివిజనల్, గ్రామస్థాయి అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ముఖ్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న జేడీఎస్ నాయకులు

పావగడ: పట్టణంలోని 23వ వార్డు పాత ఊరులో పది రోజులైనా తాగు నీరు రావడం లేదు, వెంటనే వారానికి రెండు సార్లు తాగు నీరు అందించాలని, అలాగే జేజేఎం పైపు లైను పనుల పూర్తి చేసినా రోడ్లు పూర్తిగా దెబ్బ తిన్నాయని వెంటనే రోడ్లు మరమ్మతులు చేయాలని స్థానిక జేడీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం వారు ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారులలో వీధి దీపాలు రాత్రిళ్లు సరిగా పని చేయడం లేదని వెంటనే దీపాలను సరి చేయాలన్నారు. పట్టణంలోని ఆఫ్ బండ, కన్మాన్ చెరువు వార్డులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పట్టణంలోని శిరా రోడ్డులో నాగుల కట్ట నుంచి షిరిడి సాయిబాబా దేవాలయం వరకు వీధి దీపాలు వేయాలన్నారు. మున్సిపల్ ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్‌కు జేడీఎస్ నాయకులు వినతి పత్రం అందించారు. జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు ఎస్‌పి ఈరణ్ణ, మనుమహేశ్, గుట్టహళ్లి మణి, కావలగేరి రామాంజినప్ప, అక్కులప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

లేపాక్షి: లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమలువుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. తర్వాత రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆమె సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్, సీహెచ్‌ఓ సీతామాలక్ష్మి, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు



గుంతలు పడి అధ్వానంగా ఉన్న ఎల్లోటి రోడ్డు



కంకర తేలిన హెచ్‌ఆర్ పాళ్యం రోడ్డు



మణూరు వద్ద కూలిపోయిన కల్వర్టు

- ఇబ్బందుల్లో ప్రజలు

మడకశిరరూరల్: మండలంలోని వివిధ గ్రామాల రహదారులు అధ్వానంగా మారాయి. కంకర తేలి గుంతలు పడటంతో స్థానికులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. హిందూపురం జాతీయ రహదారి తడకలపల్లి క్రాస్ నుంచి ఎల్లోటి గ్రామం వరకూ రోడ్డుపై కంకర తేలి గుంతలు పడటంతో వాహనదారులు, నడిచి వెళ్లే వారు సైతం అవస్థలు పడుతున్నారు. అదే విధంగా దిగువ రామగిరి క్రాస్ నుంచి హెచ్‌ఆర్ పాళ్యం గ్రామం వరకూ రోడ్డు కంకర తేలడంతో ప్రజలు, వాహన చోదకుల బాధ వర్ణణాతీతం. కంకర తేలి గుంతలు పడిన రోడ్ల రూపురేఖలు మారుస్తామని గత సంక్రాంతి పండుగకు ముందు సీఎం చంద్రబాబు ఆర్భాటంగా ప్రకటించారు. కానీ నేటికీ పై గ్రామాల రోడ్ల మరమ్మతులకు నోచుకోలేదని ప్రజలు వాపోతున్నారు.

కూలిన కల్వర్ట్ .. రాకపోకలకు ఇబ్బందులు

మడకశిర మండలంలోని మణూరు ఉన్నత పాఠశాల సమీపంలోని మణూరు- కల్లుమర్రి రహదారిలో గతంలో కురిసిన వర్షాలకు వంక ప్రవహించడంతో కల్వర్ట్ కూలిపోయింది. అప్పటి నుంచి వాహనదారులు, ప్రజలు పక్క వైపు నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటూ రోడ్డు పైకి వస్తున్నామని వాపోతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు ఏమాత్రం ఆజాగ్రత్త వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మోస్తరు వర్షం వస్తే ఆ రోడ్డుపై రాకపోకలకు మరింతగా ఇబ్బందిగా ఉంటుందని చెబుతున్నారు. పలు సార్లు గ్రామ సచివాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా నేటికీ తెగిపోయిన కల్వర్ట్‌కు మరమ్మతు చేయలేదన్నారు. ఇప్పటికైనా తెగిన కల్వర్ట్, అధ్వానంగా ఉన్న రోడ్లను ప్రభుత్వం వెంటనే బాగు చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

సూపర్ సిక్స్ సభ అట్టర్ ఫ్లాప్

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: అనంతపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన సూపర్ సిక్స్ .. సూపర్ హిట్ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. సభకు ఆశించినస్థాయిలో ప్రజా స్పందన లేదన్నారు. సభ విజయవంతం కాకపోవడంతో కూటమి నాయకులు షాక్‌కు గురయ్యారని పేర్కొన్నారు. సూపర్ సిక్ సభకు బలవంతంగా జన సమీకరణ చేశారన్నారు. ప్రతి మహిళా సంఘం నుంచి ఐదుగురు సభ్యులు ఈ సభకు రావాలని అధికారులు ఒత్తిడి చేయడంతో మహిళలు తప్పని పరిస్థితిలో సభకు వెళ్లారని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేయకుండానే సూపర్ హిట్ సభ నిర్వహించడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండానే అన్ని పథకాలను అమలు చేసినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. జనసేన, బీజేపీ, టీడీపీ కలిసి సభను నిర్వహించినా ప్రజల్లో స్పందన కరువైందని తెలిపారు. బలవంతపు విజయోత్సవాలు చేసుకోవడం దేశంలోనే చంద్రబాబుకు మాత్రమే సాధ్యమని విమర్శించారు. సూపర్ హిట్ సభపై ప్రజలు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. సభ కోసం కూటమి ప్రభుత్వం అడుగడుగునా పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడినా ప్రజలు ఏమాత్రం స్పందించ లేదని పేర్కొన్నారు. చంద్రబాబు ఇప్పటికైనా ప్రజలను తప్పుదోవ పట్టించడాన్ని మానుకుని సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసి విజయోత్సవం చేసుకోవాలని హితవు పలికారు.

ఆలయాల్లో వరుస చోరీలు



భైరవేశ్వరుడి ఆలయంలో హుండీ పగలగొట్టిన దృశ్యం



బీరువాను పగలగొట్టిన దొంగలు

చిలమత్తూరు: మండల పరిధిలోని పలు ఆలయాల్లో మంగళవారం రాత్రి వరుస చోరీలు జరిగాయి. మండల కేంద్రానికి సమీపంలోని స్వయంభువు భైరవేశ్వర స్వామి ఆలయంలో అర్ధరాత్రి ప్రాంతంలో ఆలయంలోకి ముగ్గురు దుండగులు ప్రవేశించి హుండీలోని సుమారు రూ.50 వేలు వరకూ సొమ్ము ఎత్తుకెళ్లారు. ముఖాలకు తువాళ్లు చుట్టుకొని రాడ్లు వినియోగించి హుండీను పగలగొట్టారు. అక్కడే ఉన్న బీరువాను బలవంతంగా తెరచి అందులోని వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. సీసీ టీవీలను గమనించి వాటిని ధ్వంసం చేశారు. అలాగే ప్రసిద్ధ కనుమ లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో కూడా ప్రవేశించిన దొంగలు హుండీ పగలగొట్టారు. హుండీలో ఏమీ లేకపోవడంతో వెళ్లిపోయారు. ఒకేరోజు ఇలా ఆలయాలను లక్ష్యంగా ఎంచుకొని దొంగతనాలకు తెగబడటం కలకలం రేపుతోంది. పోలీసులు సంఘటనా స్థలాల్ని పరిశీలించారు. జనావాసాలకు దూరంగా ఉన్న ఆలయాలను దొంగలు టార్గెట్ చేసుకున్నారని ఎస్‌ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. మత్తుకు అలవాటు పడిన యువకులు దొంగతనాలు చేసినట్లు తెలుస్తోందన్నారు. త్వరలోనే వారిని పట్టుకుంటామన్నారు.

యువతి అదృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని మోటువారపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి కనిపించడం లేదు. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు కియా పీఎస్ హెచ్‌సీ శ్యామ్ తెలిపారు.

పాడి రైతుల సమస్యలు పరిష్కరించండి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పాడి రైతులు

హిందూపురం టౌన్: ఏఐకేకేఎంఎస్ (అఖిల భారత రైతు-వ్యవసాయ కూలీ సంఘం)ఆధ్వర్యంలో పాడి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన ర్యాలీను చేపట్టారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఏఐకేకేఎంఎస్ జిల్లా కార్యదర్శి రంగనాయకులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గిరీష్ మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది రైతులు పాల ఉత్పత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పాలకు సరైన గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు పశువులు అమ్ముకుంటున్నారని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగినట్లయితే రైతుల జీవన పరిస్థితులు మరింత అధ్వానంగా మారే పరిస్థితి ఉందని చెప్పారు. వెంటనే హిందూపురంలోని ప్రభుత్వ డైరీని పునరుద్ధరించాలని, , సబ్సిడీ ధరలకు ప్రభుత్వం దాణా అందచేయాలని, గత ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు లీటర్‌పై రూ.5 అదనంగా ఇవ్వాలన్నారు. పశువులకు బీమా పథకాన్ని కొనసాగించాలని, జిల్లాలో గడ్డి పెంపకంకు ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేకేఎంఎస్ జిల్లా నాయకులు సంజీవరాయప్ప, నాగిరెడ్డి, కీర్తి, వివిధ ప్రాంతాల పాడి రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యం

రొళ్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు కావస్తోందని .. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసగించిందని జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో విమర్శించారు. సూపర్ సిక్స్ కాదు .. సూపర్ ఫ్లాప్ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందని శూన్యమన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులను బెదిరింపులకు గురిచేసి అనంతపురంలో నిర్వహించిన సభకు వెళ్లేలా చేయడం బాధాకరమన్నారు. అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం వంచిస్తోందన్నారు.

బస్సుల్లేక ప్రయాణికుల అవస్థలు

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా పల్లె వెలుగు బస్సులు బుధవారం కూడా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం నుంచే నియోజకవర్గంలో ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. దీంతో కూటమి ప్రభుత్వ తీరుపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అనంతపురంలో బుధవారం నిర్వహించిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు ఆర్టీసీ బస్సులన్నీ కూటమి నాయకులు తీసుకున్నారు. ఆర్టీసీ అధికారులు కూడా కూటమి నాయకుల ఒత్తిడికి తలొగ్గి డిపోలోని పల్లె వెలుగు బస్సులన్నీ సభకు జనాన్ని తరలించడానికి కేటాయించడంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కష్టాలు పడ్డారు. బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ బస్సులు, ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించారు. మడకశిర డిపోలో దాదాపు 30 బస్సులు ఉన్నాయి. ఇందులో దాదాపు 25 బస్సులు పల్లె వెలుగు బస్సులే. ఈ బస్సులన్నీ సభకు జనాన్ని తరలించడానికి కేటాయించడంతో ప్రయాణికులకు చుక్కలు కనిపించాయి. ప్రైవేట్ స్కూళ్లకు సంబంధించిన బస్సులను కూడా సభకు తరలించి విద్యా సంస్థలకు సెలవు ఇవ్వడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రొళ్ల: నేపాల్‌లో శాంతిభద్రతలు నెలకొన్న దృష్ట్యా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ షేక్షావలి ఒక ప్రకటనలో తెలిపారు. రొళ్ల మండలానికి చెంది ఉన్న ఎవరైనా పని నిమిత్తం, ఉద్యోగ రీత్యా నేపాల్‌కి వెళ్లిన వారు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ నంబర్ 8088084102 ఏర్పాటు చేశామని తెలిపారు. పేరు, తండ్రి పేరుతో పాటు గ్రామం పేరు, ఫోన్ నంబర్ వంటి ఇతరాత్ర పూర్తి వివరాలను తెలియజేస్తే అలాంటి వారు ఎవరైనా నేపాల్‌లో చిక్కుకొని ఉంటే సురక్షితంగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

డిమాండ్ ఉన్నా.. ప్రోత్సాహం సున్నా



నలగొండ్రాయనిపల్లి వద్ద సాగులో ఉన్న రాగి పంట



కోత దశకు వస్తున్న పంట

- బహిరంగ మార్కెట్లో రాగికి మంచి ధర
- సాగుకు మాత్రం ముందుకు రాని రైతులు

పెనుకొండ: రాగికి బహిరంగ మార్కెట్లో డిమాండ్ పెరుగుతోంది. ఆరోగ్యానికి మేలన్న వైద్యుల సూచనలతో అన్ని వర్గాల ప్రజలు ఎక్కువగా రాగితో తయారు చేసే వంటలపై దృష్టిసారించారు. దీంతో రాగి పంటకు ఎంతో ప్రాధాన్యత టుంది. ప్రస్తుతం రబీ సీజన్ కావడంతో పలు గ్రామాల్లో రాగి పంట అరకొరగా కనిపిస్తోంది. నియోజకవర్గంలో సోమందేపల్లి మండలం నలగొండ్రాయనిపల్లి గ్రామంలో రైతులు విస్తారంగా రాగి పంటను సాగు చేశారు. ప్రతి యేటా ఇక్కడ రైతన్నలు రాగి పంటకు ప్రాధాన్యం ఇచ్చి సాగు చేసి రాగి సాగులో ఆదర్శంగా నిలుస్తున్నారు. 6 నుంచి 8 తడులతో చేతికి వచ్చే పంట రాగి. ఎలాంటి సీజన్‌లోనైనా పంటను తీసుకోవడానికి రైతన్నలకు అవకాశం ఉంది.

సాగుకు మొగ్గు చూపని రైతులు

రాగికి మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉంది. దుకాణాల్లో క్వింటాలు రాగి రూ. 3800 నుంచి రూ.4 వేలపైనే పలుకుతోంది. రైతులు సైతం క్వింటాలుకు రూ. 3,800 వరకూ విక్రయిస్తున్నారు. డిమాండ్ ఇంత ఉన్నా పంట సాగుకు రైతన్నలు పెద్దగా దృష్టి సారించడం లేదు. పెనుకొండ నియోజకవర్గంలో ఏ మండలంలో చూసినా కేవలం 30 నుంచి 40 ఎకరాల లోపే పంట సాగు చేయడం చూస్తే పంటపై రైతులకు ఉన్న ధ్యాస ఏ పాటితో తెలుస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం, అధికారులు రైతన్నలను రాగి పంటపై సమాయత్తం చేయకపోవడం, ప్రభుత్వం రాగి కొనుగోలుకు సరైన ప్రోత్సాహం ఇవ్వకపోవడం వంటి కారణాలతో రాగి సాగు పూర్తిగి తగ్గుతోందని రైతులు చెబుతున్నారు.

రాగి ఆరోగ్య ప్రదాయిని

రాగి తినడం ద్వారా మనిషికి అధిక బలం చేకూరడం, దేహం ధృడంగా తయారవుతుంది. మధుమేహం, బీపీ లాంటి జబ్బులు నియంత్రణలో ఉంటాయి. అధిక క్యాలరీలు ఉన్న ఆహార వస్తువు రాగి. నేడు మానవుడు టెన్షన్ జీవితానికి అలవాటుపడి మధుమేహం, బీపీ లాంటి జబ్బులతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆయుష్షు కూడా తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో రాగి తినడం ద్వారా వ్యాధులను నియంత్రించవచ్చు. ఇక పట్టణ ప్రాంతాల్లో ఉదయమే రాగి జావ తీసుకుంటున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. – మోహన్‌నాయక్, సూపరింటెండెంట్, పెనుకొండ ప్రభుత్వాస్పత్రి

ఘనంగా గురు పూజోత్సవం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

గుడిబండ: పట్టణ కేంద్రంలోని ఎంజేపీ బాలికల కళాశాలలో బుధవారం గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుతగా మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌ను విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుల కృషి చేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో ఉపాధ్యాయులందరూ అంకిత భావంతో వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ హిట్ అని చెప్పకోవడం సిగ్గు చేటు

మడకశిర: సూపర్ సిక్స్ పథకాలు.. సూపర్ హిట్ అయ్యాయంటూ కూటమి ప్రభుత్వం అనంతపురంలో సభను నిర్వహించడం సిగ్గుచేటని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి ఒక ప్రకటనలో విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ సూపర్ హిట్ అయ్యాయో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పాలన్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు ఆడ బిడ్డ నిధి కింద రూ.1,500 ఇచ్చారా? అని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.2 వేలు కోత విధించారన్నారు. సభ పేరుతో జిల్లాలోని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ వరదరాజును సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక తహసీల్దార్ వరదరాజు బదిలీ నేపథ్యంలో తాలూకా కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఆయన్ను బుధవారం ఘనంగా సత్కరించారు. అలాగే కొత్తగా వచ్చిన తహసీల్దార్ వై రవికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలువురు తహసీల్దార్ వరదరాజు అందించిన సేవలను కొనియాడారు. వరదరాజు మాట్లాడుతూ విధుల్లో సహకరించిన తోటి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.